# ఇంటర్మీడియట్ – ద్వితీయ సంవత్సరం

## ద్వితీయ భాష – తెలుగు; భాగం – II

## మాదిరి ప్రశ్నపత్రం

సమయం: **3** గంటలు   గరిష్ఠ మార్కులు: **100**

సూచన: **1.** ప్రశ్నపత్రం ప్రకారం వరుస క్రమంలో సమాధానాలు రాయాలి.

**2.** ఒక మార్కు ప్రశ్నల జవాబులను కేటాయించిన ప్రశ్న కింద వరుస క్రమంలో రాయాలి.

**I.** కింది పద్యాల్లో ఒకదానికి ప్రతిపదార్థ తాత్పర్యాలను రాయండి. **1 × 6 = 6**

1. తడవే లోరి పుళిందరాజ! చను మధ్యాహ్నంబు డాయంగన
య్యెడు నీవేళ శివార్చనంబునకు మా కేకాంతమమై యుండcగాc
బడు నీవుం గడు డస్సినాcడ వటవీపంక్తి ప్రచారంబులన్,
విడు కోపం బిదె శాంతి గైకొనుము వాగ్వ్వాదమిం తేటికిన్.

2. ప్రారంభించిన వేదపాఠమునకున్ బ్రత్యూహ మౌనంచునో
యేరా తమ్ముడ! నన్ను జూడc జనుదే వెన్నాళ్లనోయుండి చ
క్షూరాజీవ యుగంబు వాచె నినుగన్గోc కున్కి మీబావయున్
నీరాకల్ మదిc గోరు చంద్రుపొడుపున్ నీరాకరంబుంబలెన్.

**II.** కిందివాటిలో ఒక ప్రశ్నకు **20** పంక్తుల్లో సమాధానం రాయండి. **1 × 6 = 6**

1. కిరాతుడు అర్జునుడిని యుద్ధానికి ప్రేరేపించిన తీరును వివరించండి.
2. నగర జీవితాన్ని గురించి వర్షానికి ఉన్న అవగాహనను వివరించండి.

**III.** కిందివాటిలో ఒక ప్రశ్నకు **20** పంక్తుల్లో సమాధానం రాయండి. **1 × 6 = 6**

1. గోలకొండ పట్టణ నిర్మాణం – విశిష్టతలను వివరించండి.
2. ఆచారాల స్వరూప స్వభావాలను తెలిపి భారతదేశంలో జరిగిన సంస్కరణోద్యమాలను వివరించండి.

**IV. కిందివాటిలో రెండు ప్రశ్నలకు 15 పంక్తుల్లో సమాధానం రాయండి.** **2 × 4 = 8**

1. 'కనువిప్పు' నాటిక సారాంశాన్ని తెలపండి.
2. 'పైపంట' నాటికలోని రైతు ఆర్థిక పరిస్థితిని తెలపండి.
3. కొత్త ఆఫీసరు ఆఫీసును సంస్కరించడానికి ఎన్నుకున్న మార్గాన్ని వివరించండి.
4. కొమరయ్య పాత్ర స్వభావం ఏమిటి?

**V. కిందివాటిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి.** **2 × 3 = 6**

1. శాంతిపరులకు నేలరా సత్వహింస
2. కులధ్వంసంబు నీ కర్థమే
3. కొలువుకుదిరి యెన్నాళ్లయిందో?
4. రాత్రికి వచ్చిన చుట్టంలా తిష్ట వేస్తుంది తీరిగ్గా

**VI. కిందివాటిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి.** **2 × 3 = 6**

1. వెరీగుడ్, నిజాయతీ అంటే అట్లా ఉండాలి
2. పరువు పోతుంది. పరపతీ పోతుంది
3. అంతా చెప్పనిచ్చి సీతకు రాముడేం కావాలంటే?
4. చిలుకా గోరింకలోలె హాయిగా ఉండొచ్చు

**VII. కిందివాటిలో రెండింటికి సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.** **2 × 2 = 4**

1. నిగమశర్మ స్వభావం
2. పల్లెటూరి జీతగాడి వేషధారణ
3. కృష్ణుడు అమరావతికి ఎందుకు వెళ్లాడు?
4. పసివాడిపై కురిసే వర్ష స్వభావాన్ని తెలపండి.

**VIII. కిందివాటిలో రెండింటికి సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.** **2 × 2 = 4**

1. 'చార్మినార్' నిర్మాణం – ప్రాముఖ్యాన్ని తెలపండి.
2. ఎద్దుకు, యజమాని తండ్రికి గల స్నేహం తెలపండి.
3. గోదావరి నది గురించి బాపిరాజు చేసిన వర్ణన ఎటువంటిది?
4. కుటుంబాల్లో స్త్రీలపై అణచివేత ఎలా ఉండేది?

**IX.** **కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానం రాయండి.** **6 × 1 = 6**

1. 'పాండురంగ మహాత్మ్యం' అంకితాన్ని పొందిందెవరు?
2. ఇంద్రుడి భార్య పేరేమిటి?
3. 'ఫ్రీవర్స్ ఫ్రంట్'ను ఎవరు స్థాపించారు?
4. శ్రీనాథుడు రచించిన రెండు గ్రంథాల పేర్లు తెలపండి.
5. పాలా వెంకట సుబ్బయ్య కవిత్వ గురువు ఎవరు?
6. బాలకార్మికుడి జీవితాన్ని కవి ఏమని పేర్కొన్నాడు?

**X.** **కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానం రాయండి.** **6 × 1 = 6**

1. 'నగీనాబాగ్' అంటే ఏమిటి?
2. బ్రహ్మదేవుడికి మొదట ఎన్ని తలలు ఉండేవి?
3. ఆచారాలు – సంస్కరణలు వ్యాస రచయిత ఎవరు?
4. హిట్లర్ చర్యలను నిరసిస్తూ చార్లీ చాప్లిన్ తీసిన సినిమా ఏది?
5. గోపీచంద్ రాసిన ఏ నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది?
6. 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా' అని పిలిచిన కవి ఎవరు?

**XI.** **కిందివాటిలో ఒకదానికి లక్షణాలు తెలిపి ఉదాహరణలతో సమన్వయించండి.** **1 × 6 = 6**

1. చంపకమాల
2. కందం
3. తేటగీతి

**XII.** **కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.** **6 × 1 = 6**

1. ఉత్పలమాల గణాలు ఏవి?
2. శార్దూల పద్యంలో ఎన్నో అక్షరానికి యతి మైత్రి ఉంటుంది?
3. ఆటవెలదిలో యతి మైత్రి ఏయే గణాల మొదటి అక్షరాలకు ఉంటుంది?
4. సీస పద్యానికి అనుబంధంగా ఏయే పద్యాలు రాయాలి?
5. ప్రాస యతి అంటే ఏమిటి?
6. కంద పద్యంలో బేసి స్థానంలో ఏ గణం ఉండకూడదు?

**XIII. కిందివాటిలో ఒకదానికి లక్షణాలు తెలిపి ఉదాహరణలతో సమన్వయించండి.** **1 × 6 = 6**

1. ఉపమాలంకారం
2. రూపకం
3. అతిశయోక్తి

**XIV. కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.** **6 × 1 = 6**

1. ఉపమేయం అంటే ఏమిటి?
2. 'కమలాక్షునర్చించు కరములు కరములు' – ఈ పాదంలోని అలంకారం ఏది?
3. 'వలె, పోలె, అట్లు' – ఈ పదాలను ఏమని పిలుస్తారు?
4. అంత్యానుప్రాసకు ఒక ఉదాహరణ రాయండి.
5. ఉపమేయ, ఉపమానాల మధ్య ఉండే అభేదం తెలిపే అలంకారం ఏది?
6. అర్థాలంకారం అంటే ఏమిటి?

**XV. కింది పదాలను ఆధారంగా తీసుకుని విద్యార్థి ఆదాయపత్రం కోసం అధికారితో సంభాషణను రాయండి.** **6 × 1 = 6**

(ఆదాయపత్రం – దరఖాస్తు – జతపరుచు – ఉపకారవేతనం)

**XVI. కింది ప్రశ్నలకు ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.** **6 × 1 = 6**

**అ)**
1. సర్వనామం అంటే ఏమిటి?
2. విశేషణానికి ఒక ఉదాహరణ రాయండి.
3. 'అశోకుడు గొప్ప చక్రవర్తి' – ఇందులో నామవాచకం ఏది?
4. 'కృష్ణ మైదానానికి వెళ్లాడు' – ఇందులో క్రియాపదం ఏది?
5. 'అప్పుడు, ఇప్పుడు' అనేవి ఏ భాషాభాగానికి చెందుతాయి?
6. నామవాచకం అంటే ఏమిటి?

**ఆ) కింది ప్రశ్నలకు ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.** **6 × 1 = 6**

1. వాక్య దోషాలు ఎన్ని రకాలు?
2. 'కృష్ణదేవరాయలు ఆధునిక కవి' – వాక్యంలో దోషాన్ని ఏమంటారు?
3. 'సీత అడవికి వెళ్లాడు' – వాక్యంలోని దోషాన్ని సవరించి తిరిగి రాయండి.
4. వర్ణవ్యత్యయానికి ఒక ఉదాహరణ ఇవ్వండి.
5. 'విద్యార్థి – విధ్యార్ధి' ఈ రెండింటిలో దోషమున్న పదమేది?
6. 'పరిణతి – పరినతి' – ఇది ఏ విధమైన దోషం?

www.

# సమాధానాలు

**I.** **ప్రతిపదార్థ తాత్పర్యాలు**

**1వ పద్యం:**

**1.** **తడవే లోరి పులిందరాజ!.... వాగ్వివాదమింతేటికిన్**

**జ:** **ప్రతి పదార్థం**

ఓరి పులిందరాజ = ఓ పులింద ప్రభువా! (ఓ చెంచురాజా!)

తడవు = ఆలస్యం

ఏల = ఎందుకు?

చను = ఇక్కడ నుంచి వెళ్లు

మధ్యాహ్నంబు = మధ్యాహ్నం

డాయంగనయ్యెడున్ (డాయంగన్ + అయ్యెడున్) = సమీపిస్తున్నది

మాకున్ = మాకు

శివార్చనంబునకున్ (శివ + అర్చనంబునకున్) = ఈశ్వర పూజకు

ఏకాంతమై = ఏకాగ్రమై (ఒంటరిగా)

ఉండగాఁబడున్ = ఉండాలి

నీవున్ = నీవు కూడా

అటవీ పంక్తి ప్రచారంబులన్ }
అటవీ పంక్తి = అడవుల వరుసలలో }
ప్రచారంబులన్ = ఎక్కువగా తిరగడం వల్ల }
కడున్ = మిక్కిలి }

డస్సినడవు = అలసిపోయావు

విడు = విడిచిపెట్టు

గైకొను = గ్రహించుము (శాంతం వహించు)

వాగ్వివాదం (వాక్ + వివాదం) = మాటల కలహం

ఏటికిన్ = ఎందుకు?

**తాత్పర్యం:** ఓ చెంచు రాజా! (పుళిందరాజా) ఆలస్యం ఎందుకు? నీవు ఇక్కడి నుంచి వెళ్లు. మధ్యాహ్నం కావస్తోంది. మేము శివార్చనకై ఏకాంతమై ఉండాల్సిన అవసరం ఉంది. నీవు కూడా అడవుల్లో సంచారం చేయడం వల్ల మిక్కిలి అలసిపోయావు. కాబట్టి కోపాన్ని విడిచిపెట్టు. శాంతిని వహించు. ఇంతగా ఈ మాటలు కలహం ఎందుకు?

**కవి గురించి:** కవి సార్వభౌమ శ్రీనాథుడు రచించిన 'హరవిలాసం' సప్తమాశ్వాసం నుంచి గ్రహించిన 'స్పర్ధ' అనే పద్య భగంలోనిది ఈ పద్యం. మారువేషంలో ఉన్న శివుడి (చెంచు రాజు)ని ఉద్దేశించి అర్జునుడు పలికిన సందర్భంలోనిది.

**2వ పద్యం:**

ప్రారంభించిన వేద పాఠమునకున్..... నీరాకరంబుంబలెన్

**ప్రతిపదార్థం**

ప్రారంభించిన = మొదలుపెట్టిన

వేదపాఠమునకున్ = వేదాలు నేర్పడానికి

ప్రత్యూహం = విఘ్నం

ఔనంచున్ = అవుతుందనేమో

ఏరా తమ్ముడా! = ఒరేయ్ తమ్ముడా!

చనుదేవు = రావడం లేదు

నినున్ = నిన్ను

కన్గోకున్కి = చూడకపోవడం వల్ల

చక్షూరాజీవయుగంబు (చక్షు + రాజీవం) = పద్మాల వంటి నా కన్నుల జంట

వాచెన్ = వాచిపోయింది

మీ బావయున్ = మీ బావగారు కూడా

చంద్రు పొడుపున్ = చంద్రోదయాన్ని

నీరాకరంబున్‌బలెన్ = సముద్రంలా

నీరాకల్ = నీ రాకను

మదిన్ = తన మనసులో

కోరున్ = కోరుకుంటారు

**తాత్పర్యం:** ఒరే తమ్ముడా! నీవు ప్రారంభించిన వేద పాఠానికి విఘ్నం కలుగుతుందనేమో, నీవు నన్ను చూడ్డానికి ఎన్నాళ్ల నుంచో రావడం లేదు. నిన్ను చూడాలని నీ కోసం ఎదురు చూసి, నా కళ్లు కాయలు కాశాయి. చంద్రోదయాన్ని సముద్రం కోరేటట్లు, నీరాకను మీ బావ కోరుకుంటున్నాడు.

**కవి గురించి:** వికట కవిగా ఖ్యాతి గాంచిన తెనాలి రామకృష్ణ కవి రచించిన 'శ్రీ పాండురంగ మహాత్మ్యం' తృతీయశ్వాసం నుంచి ఈ పద్యాన్ని గ్రహించారు. నిగమశర్మ అక్క తన తమ్ముడితో చెప్పిన సందర్భంలోని పాఠ్యాంశం 'హితోక్తి'.

**II. వ్యాసరూప ప్రశ్నలు (ఒక దానికే సమాధానం రాయాలి)**

**1. ఎ) కిరాతుడు అర్జునుడిని యుద్ధానికి ప్రేరేపించిన తీరును వివరించండి.**

**జ: కిరాతుడి గర్వపు మాటలు:**

ఓరీ నీవు ఎవరివి? నేను పందిని చంపుతానని ప్రతిజ్ఞ చేసి వెనక వస్తుండగా, నీవు కొట్టి చంపావు. తపస్వివైన నీ లాంటి శాంతిపరులకు జీవహింస తగదు. వేరొక వేటగాడు కొట్టిన జంతువును కొట్టి శవం మీద బాణం వేశావు, అని కిరాతుడు అర్జునుడిని నిందించాడు. తన మీదకు వచ్చిన జంతువును చంపడమే ధర్మమని అర్జునుడు పలికాడు.

అర్జునుడి మాటలను గర్విష్ఠి అయిన కిరాతుడు వినకుండా అతడితో ఇలా అన్నాడు.

'ఇలాంటి అసందర్భపు మాటలు నాకనవసరం. పంది నాకు ముఖ్యం కాదు. వేట ధర్మాన్ని తప్పి మమ్మల్ని నీవు ధిక్కరించావు. నీవు తపస్వి కాబట్టి నిన్ను శిక్షించను. నీలో గర్వం కనిపిస్తోంది. నీ తపస్వితత్వం కపటమైంది. నిన్ను చూడగానే నా భార్య సన్నిధిలో చాపాన్ని పట్టాలని నా హృదయం కోరుకుంటోంది. నాపై వాడి అయిన క్రూర బాణాలను ప్రయోగించు. నేను చెంచు జాతి వాడినని ఆలోచించకు. అంతటిలో నీ శివలింగార్చన ఎక్కడికీ పోదు. నీ తపస్విత్వానికి భంగం రాదు. నీ బాహు పరాక్రమ లక్ష్మిని నా ముందు ప్రదర్శించు.

నువ్వు నాపై బాణాలు ఎక్కు-పెట్టు. నాకు పంది అనవసరం. నా భార్య భయంకరమైన వీరుల యుద్ధాన్ని చూడాలని కోరుకుంటోంది' అని అర్జునుడిని తనతో యుద్ధం చేయాలని ప్రేరేపించి, తన వింటి నారిని మోగించి, అర్జునుడికి కోపాన్ని తెప్పించాడు.

**2. నగర జీవితాన్ని గురించి వర్షానికి ఉన్న అవగాహనను వివరించండి.**

జ: వర్షానికి నగరవాసుల జీవితం గురించి మంచి అవగాహన ఉంది. ఉద్యోగి తనకొచ్చిన తక్కువ జీతంతో గొడుగును కొనలేడని, వర్షం నుంచి రక్షణ కోసం గోనె సంచిని కప్పుకోవడం అతడికి మోటు అని కూడా తెలుసు. ఆఫీసులు సరిగ్గా అయిదు గంటలకే వదులుతారని వానకు అవగాహన ఉంది. ఉన్న ఒక్క సూటు తడిసిపోతే వేసుకోవడానికి మరో జత దుస్తులు అతడికి లేవని వానకు తెలుసు. అయినా, ఆఫీసులు వదిలే వేళకు ఆకాశం చిల్లు పడ్డట్లు వర్షం కురుస్తుంది.

బడి పిల్లవాడు పలకా, పుస్తకాలను నెత్తిన పెట్టుకుని ఇంటికి వాన, బురద వల్ల తడిచి ముదికిగా వెళితే తల్లి ఆ పిల్లవాడిపై అరుస్తుందని వానకి తెలుసు. నాగేశ్వరరావు పొద్దుటే లేచి గొడుగు తీసుకుని వెళితే ఆ రోజు వర్షం కురవదు. అతడు గొడుగు తీసుకెళ్లని రోజు కుంభవృష్టి కురుస్తుంది. నగరంలో కురిసే వాన కేవలం గడుసుదే కాదు, దానికి కొంచెం దయా, ధర్మం కూడా ఉన్నాయి. అందుకే ప్రసవించిన తల్లి పాపను గుండెకద్దుకుని ఇంటికెళ్లే సమయంలో పూల జల్లు కురిపిస్తుందే తప్ప బోరున వాన కురవదు.

ఆగస్టు 15న జెండా వందన సమయంలో రెండు, మూడు గంటలు బారులు తీరి నిలబడిన బాలబాలికలపై వాన జాలిగా తుంపర్లు పడుతుంది గానీ జలజలా కురవదు.

ఈ విధంగా నగరంలో కురిసే వానకు ఎప్పుడు కురవాలో, ఎప్పుడు కురవకూడదో తెలుసని, దానికి నగర జీవితంపై మంచి అవగాహన ఉందని కవి భావన.

**III. కిందివాటిలో ఒక ప్రశ్నకు 20 పంక్తుల్లో సమాధానం రాయండి.**

**1. గోలకొండ పట్టణ నిర్మాణం – విశిష్టతలను వివరించండి.**

జ: గోలకొండ దుర్గమంటే మూడు కోటలు. మొదటి రెండు కోటల ప్రాకారాల మధ్యనే గోలకొండ పట్టణంలోని ముఖ్య భాగం ఉంది. ఈ దుర్గానికి ఏడు మైళ్ల కైవారం, 87 బురుజులు, ఎనిమిది దర్వాజాలు ఉన్నాయి. దీనికి సుమారు 4 మైళ్ల వైశాల్యం ఉంది. ఈ పట్టణాన్ని 'అజంఖాన్' అనే ఇంజినీరు నిర్మించాడు. దీన్ని చాలా భాగాలుగా విభజించారు. వాటిని 'మొహల్లాలు' అని పిలిచేవారు. అంటే వీధులు అని అర్థం.

గోలకొండ పట్టణంలో ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు ఎక్కువగా ఉండేవి. పట్టణం సందడిగా ఉండేది. పడమటి దిశలో రాజభవనాలు ఉండేవి. మిగిలిన దిశల్లో ప్రజలు ఉండేవారు. ఈ పట్టణానికి పెంపు, సొంపు సమకూర్చడంలో మొదటి, నాలుగో, అయిదో, ఏడో కుతుబ్‌షాహీలు శ్రద్ధ చూపారు. ఇబ్రహీం కుతుబ్‌షా సర్దార్లను, దనవంతులనూ కోటలోపలే ఇళ్లు కట్టమని చెప్పాడు.

కచ్చేరి భవనాలు, ఉద్యోగస్తుల భవనాలు, దేవాలయాలు, మసీదులు, ధర్మశాలలు, బిక్షాగృహాలు, అందమైన ఉద్యానవనాలు, పాఠశాలలు, స్నాన మందిరాలు నగరంలో నిర్మించారు. నవీనాబాగ్ అనే అందాల ఉద్యానవనం ఉండేది. నాటి ఇంజినీర్లు తమ ప్రతిభతో ' సాహిమహలులు' అనే రాజ భవనాలను నిర్మించారు. 'దిల్‌కుషా' అనేది అందమైన రాజ భవనం. యుద్ధ భటులకు రెండు బారకాసులు ఉండేవి.

గోలకొండ పట్టణంలో ఆకర్షణీయమైన మిద్దెల మీద తోటలు ఉండేవి. వాటికి నీటి సరఫరా విధానం, నీటి కాలువలు, జలాశయాలు, జలపాతాలు, కేళాకూళులు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇక్కడ 'కటోరా' అనే జలాశయం ఉండేది. ఈ ప్రాంతంలో గొప్పవారు వేసవిలో విహరించేవారు. ఇక్కడ సుమారు 2 లక్షల మంది జనాభా ఉండేది. వీరి కోసం మహ్మద్ కులీకుతుబ్‌షా 78 లక్షల హోసులు ఖర్చు చేశాడు. జనానికి తాగునీరు దొరకడానికి ఏర్పాట్లు చేశాడు. నీటి నిల్వకు చాలా హవుజులు నిర్మించాడు. ఇందులో కొన్ని జనానావారికి ప్రత్యేకించారు.

**2. ఆచారాల స్వరూప స్వభావాలను తెలిపి భారతదేశంలో జరిగిన సంస్కరణోద్యమాలను వివరించండి.**

జ: 'ఆచారం' అంటే ఒక సంఘంలోని సభ్యులు సంప్రదాయకంగా ఉన్న ప్రామాణికమైన ప్రవర్తనా పద్ధతిని 'ఆచారం' అంటారు. ఒక చర్యకు సంబంధించిన నియమం కానీ, నిబంధన కానీ అవుతుంది. ఆచారం మానవజాతికి చెందిన ప్రాచీనమైన అలిఖిత ధర్మశాస్త్రం.

స్వభావం:

1) ఒక పనిని ఒక వ్యక్తి నిత్యం చేస్తూ ఉంటే అది అలవాటు. అదే జాతి పరంగా, సంఘ పరంగ చేస్తే ఆచారం. అలవాట్లలో మనుషుల మధ్య తేడాలుండవచ్చు కానీ ఆచారాలు దేశం, జాతి మొత్తానికి చెందుతాయి.

2) ఏవైతే అందరి శ్రేయస్సుకు, సంఘం అభివృద్ధికి దోహదం చేస్తాయో వాటినే ఆచారాలు అంటారు.

3) ఒక దేశానికి, వర్గానికి, జతికి, సహజమైన ఆచారం వేరొక వర్గానికి విడ్డూరంగా అనిపించొచ్చు.

4) ఆచారం, సంప్రదాయం, విశ్వాసం ఒకటి కావు.

5) ఆచారం ప్రధానంగా ఆచరణకు సంబంధించింది.

ఆచారాలు జీవన విధానాలను వెల్లడిస్తాయి. జాతిని నైతిక పతనం నుంచి కాపాడతాయి. ఇవి సాంస్కృతిక జీవితంలో ఓ భాగం. కొన్ని ఆచారాలు కాల క్రమంలో తమ అంతశ్శక్తిని కోల్పోయి చెడు ఫలితాలను కలిగిస్తాయి. ఒక నాటి బాల్య వివాహాలు తర్వాతి కాలంలో కన్యాశుల్కానికి దారితీశాయి. స్త్రీల ఆర్థిక భద్రత కోసం వివాహ సమయంలో వారికి ఇచ్చే ఆస్తులు క్రమంగా వరకట్నానికి దారి తీసింది.

**సంస్కరణోద్యమాలు:**

స్వాతంత్ర వాంఛకు ముందే భారతీయుల్లో సంప్రదాయక సమాజాన్ని సంస్కరించాలనే కోరిక కలిగింది. ఆ తర్వాతే జాతీయోద్యమం బలపడింది. 1890 నుంచి స్వాతంత్ర, సంఘసంస్కరణోద్యమాలు సమాంతరంగా సాగాయి. సమాజంలో విప్లవాత్మక మార్పులను ప్రవేశ పెట్టాలనే కృషి 19వ శతాబ్దంలో బెంగాల్లో ప్రారంభమైంది. రాజారామ్మోహన్ రాయ్ ప్రారంభించిన సంఘ సంస్కరణ కార్యక్రమాలు అందుకు దోహదం చేశాయి. బ్రహ్మసమాజం ప్రముఖ పాత్ర పోషించింది. ఆంగ్లభాషా సాహిత్య ప్రభావంతో ఎంతో మంది మేధావుల ఉద్యమాలు సంఘ సంస్కరణకు అవసరమైన పునాదిని వేశాయి. కందుకూరి, ముద్దు నరసింహం, వీరాస్వామి, గురజాడ, వేంకటరత్నం నాయుడు, చిలకమర్తి లాంటివారు ఈ కోవకు చెందినవారు.

వీరేశలింగం అనుయాయులు తమ ప్రసంగాల ద్వారా మధ్య తరగతి వర్గాన్ని దురాచారాల నుంచి దూరం చేయగలిగారు. సంఘసంస్కర్తల కృషి వల్ల బాల్య వివాహాలు, కన్యాశులకం లాంటి దురాచారాలు తగ్గాయి.

ఆంధ్రదేశంలో ఉద్యమాల ప్రభావం ఎంతగానో ఉండేది. రామస్వామి చౌదరి వివాహ విషయంలో ప్రవేశపెట్టిన సంస్కరణలకు ఉద్యమ ప్రభావమే కారణమని చెప్పొచ్చు.

**IV. కిందివాటిలో రెండు ప్రశ్నలకు 15 పంక్తుల్లో సమాధానం రాయండి.**

**1. 'కనువిప్పు' నాటిక సారాంశాన్ని తెలపండి.**

**జ:** మల్లయ్య తన కూతురు పుల్లమ్మను, తన చెల్లెలు పంతం మేరకు మేనల్లుడు వీరయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. వీరయ్య నగరంలో హాస్టల్‌లో ఉంటూ, తండ్రి కొమరయ్య, మేనమామ మల్లయ్య పంపిన డబ్బులతో చదువుకుంటున్నాడు. వీరయ్య చదువుకున్న ఆడపిల్లలతో తిరగడం వల్ల పుల్లమ్మ నచ్చలేదు. ఆమె తనకు అక్కర్లేదని తండ్రికి ఉత్తరాలు రాశాడు. తండ్రి కొమరయ్యకు కూడా మొదటి నుంచి పుల్లమ్మను చేసుకోవడం ఇష్టం లేదు. కొడుక్కి నచ్చజెప్పడం మాని, పుల్లమ్మను ఏలుకోడనీ మల్లయ్యకు కబురు పెట్టాడు.

వీరయ్య మిత్రుడు రఘుకు మల్లయ్య దంపతులు తమ బాధను చెప్పుకున్నారు. వీరయ్యకు రఘు హితోపదేశం చేశాడు. పుల్లమ్మ బతుకు పాడవుతుందని చెప్పాడు. వీరయ్యకు మిత్రుడి ఉపదేశంతో కనువిప్పు కలిగింది. మామ మల్లయ్య వద్దకు వెళ్లి తనకు బుద్ధి వచ్చిందని, భార్య పుల్లమ్మ కావాలనీ చెప్పి తన తప్పును వీరయ్య అంగీకరించాడు.

**2. 'పైపంట' నాటికలోని రైతు ఆర్థిక పరిస్థితిని తెలపండి.**

జ: పండించిన పంటకు సరైన ధర రైతుకు రాదు. పంట చేతికి రాగానే దాన్ని గ్రామంలోని షావుకారుకో, కమిషన్‌దారుకో సగం ధరకు అమ్ముకోవాలి. వారు సగం ధరకు లేదా అంతకంటే తక్కువ ధరకు కొంటారు. గ్రామంలోని మునసబు, కరణాలు బక్కచిక్కినరైతులనే కిస్తు కట్టాలని వేధిస్తారు. వారు ధనవంతుల జోలికి పోరు.

రైతులు కష్టపడి పండించినా, అది నోటి వరకూ వచ్చేది కాదు. వ్యాపారులు, కమిషన్‌దారులు గెద్దల్లా తన్నుకుపోయేవారు. రైతులకు కట్టుకోవడానికి బట్ట, తినడానికి తిండి ఉండేది కాదు. రైతు భార్య చీరల కోసం ఎంతో బాధపడేది. గ్రామాల్లో బట్టల వర్తకులు నాసిరకం బట్టలిచ్చి వారిని మోసం చేసేవారు. గ్రామాల్లోని దుకాణదారులు రైతులకు అరువులిచ్చి, ఇష్టం వచ్చిన ధరలు వసూలు చేసేవారు. నోట్లపై అప్పులిచ్చిన షావుకారులు వారిని బెదిరించి మరీ వసూలు చేసేవారు.

గ్రామాల్లోని రైతుల ఆర్థికస్థితి దయనీయంగా ఉండేదని ఈ నాటిక ద్వారా తెలుస్తుంది.

**V. కిందివాటిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి.**

**1. శాంతి పరులకునేలరా సత్వహింస**

**కవి పరిచయం:** ఈ వాక్యం శ్రీనాథ మహాకవి రచించిన 'హరవిలాసం'లోని సప్తమాశ్వాసం నుంచి గ్రహించిన 'స్పర్థ' అనే పద్యభాగంలోనిది.

**సందర్భం:** ఈశ్వరార్జునులు వేసిన బాణాలు తగిలి మూకాసురుడు అనే వరాహం మరణించింది. కిరాతుడి వేషంలో ఉన్న శివుడు తాను చంపుతానని ప్రతిజ్ఞ చేసి, వెనక వస్తున్నాననీ, అర్జునుడు బాణం వేసిదాన్ని కొట్టి తన వేడుకను పాడు చేశాడని అతడిని నిందించాడు. తపస్సు చేసుకునేవాడై ఉండి, ధనుస్సు ధరించడం తగదని, శాంతిపరులైన తపస్వులకు సత్వహింస పనికిరాదనీ అర్జునుడిని మందలించిన సందర్భం.

**అర్థం:** శాంతి పట్ల ఆసక్తి ఉన్నవారికి జంతు హింస తగదు.

**వ్యాఖ్య:** తపస్సు చేసుకునే అర్జునుడు ధనస్సును ధరించడం, పందిని చంపి జంతుహింస చేయడం తగదని కిరాతుడి అభిప్రాయం.

**2. కులధ్వంసంబు నీ కర్హ మే**

**కవి పరిచయం:** ఈ వాక్యం తెనాలి రామకృష్ణుడు రచించిన 'పాండురంగ మహత్మ్యం'లోని తృతీయాశ్వాసం నుంచి గ్రహించిన 'హితోక్తి' అనే పాఠంలోనిది.

**సందర్భం:** నిగమ శర్మ అక్క మొదట బాగా కోపంతో మందలించింది. అతడిలో మార్పు కనిపించకపోవడంతో, ఆమె తన కోపాన్ని తగ్గించుకుంది. సామరస్యంతో తన ఆవేదనను తమ్ముడి ముందు వెల్లడించింది. 'తమ్ముడూ నీకున్న ధనాన్ని అనవసరంగా ఖర్చు చేస్తున్నావు. చక్కగా సంవత్సరానికి మూడు పంటలు పండే కాశ్మీర ఖండాలను తెగనమ్మడం మంచిది కాదు. నీకు భార్య లేదా? తమ్ముళ్లు ఎవరూ లేరా? ఈ విధంగా కులధ్వంసం చేయడం నీకు ఉచితమేనా?' అని తమ్ముడిని మందలించింది.

**అర్థం:** వంశాన్ని నాశనం చేయడం నీకు ఉచితమా?

**వ్యాఖ్య:** 'చరాస్తి'ని పాడు చేసినా పర్వాలేదు. కానీ స్థిరాస్తులైన మంచి పంటలు పండే పొలాలను ఇష్టం వచ్చిన రీతిలో అమ్మడం మాత్రం మంచిది కాదు.

**VI. కిందివాటిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి.**

**1. వెరీగుడ్, నిజాయతీ అంటే అట్లా ఉండాలి.**

జ: **కవి పరిచయం:** ఈ వాక్యం డాక్టర్ అంతటి నరసింహం రచించిన 'ఎక్కడ గొంగళి అక్కడే' నాటిక లోనిది.

**సందర్భం:** పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కొత్త అధికారి వచ్చి పాత ఆఫీసర్‌పైన ఉన్న ఛర్జీలు గరించి ఉద్యోగస్తులను ప్రశ్నిస్తూ.. 'మీ పాత ఆఫీసర్ మీద ఛార్జీలున్నాయా? ' అని అడిగాడు. అందుకు గుమస్తా మాధవరావు పాత ఆఫీసరుపైన చెబితే, రేపు మీ మీద నేరాలు చెబుతాడని నా గురించి మీరు అనుకుంటారని' అన్నాడు. అందుకు ఆఫీసర్ 'వెరీగుడ్, నిజాయతీ అంటే అట్లా ఉండాలి' అని చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** చాలా బాగుంది. నిజాయతీ అంటే ఇలా ఉండాలి.

**వ్యాఖ్య:** మాధవరావు పాత ఆఫీసరుపైన ఉన్న నేరాలను కొత్త ఆఫీసర్‌తో చెప్పకూడదన్నప్పుడు, కొత్త ఆఫీసర్ మాధవరావు నిజాయతీ పరుడని ప్రశంసించాడు.

**2. పరువుపోతుంది.. పరపతి పోతుంది.**

**కవి పరిచయం:** ఈ వాక్యం నార్ల వెంకటేశ్వరరావు రచించిన 'పైపంట' నాటిక లోనిది.

**సందర్భం:** కిస్తీ కట్టాలని, మునసబు రమ్మంటున్నారని వెట్టివాడు రైతుకు చెప్పాడు. రైతు సరే అన్నాడు. కరణాలు బీద రైతులనే ఒత్తిడికి గురి చేస్తారని కొడుకు అన్నాడు. కార్తీకం నాటికి ధాన్యం ధర రెట్టింపు అవుతుందనే కొడుకు మాటలకు రైతు కార్తీకం వచ్చే వరకూ కిస్తీని, అప్పుల వాళ్లనూ ఆపలేమని, అప్పులవాళ్లు ఎవరికి కావాల్సిన దాన్ని వారు పట్టుకుపోతారని, దాని వల్ల పరువు, పరపతి పోతుందని కొడుకుతో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** గౌరవం పోతుంది. పలుకుబడి పోతుంది.

**వ్యాఖ్య:** రైతు పరువు, పరపతి నిలబెట్టుకోవడానికి ప్రయత్నించే సజ్జనుడు.

**VII. కిందివాటిలో రెండింటికి సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.**

**1.** నిగమశర్మ స్వభావం

జ: పీఠికాపురంలో నివసించే సభాపతి కుమారుడు నిగమశర్మ వేదశాస్త్రాలను చదువుకున్నాడు. దుస్సాంగత్యం వల్ల చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ముసలి తల్లిదండ్రులను, కుటుంబాన్ని పట్టించుకోలేదు. భోగలాలసతకు ఆస్తిని పాడుచేశాడు. అప్పుల పాలయ్యాడు. వంశ ప్రతిష్ఠను పట్టించుకోలేదు. పండితులను సముచిత రీతిలో గౌరవించలేదు. అతడిది పిల్లి శీలం. అతడి చదువులు చిల్కల చదువులు. చివరకు ఏటా మూడు పంటలు పండే పొలాలను సైతం తెగనమ్మాడు.

**2.** **పసివాడిపై కురిసే వర్ష స్వభావాన్ని తెలపండి.**

**జ:** పసివాడిపై కురిసే వర్షానికి కాస్తో, కూస్తో దయ, ధర్మం ఉంటాయి. పచ్చి బాలింతరాలు తీసుకు వచ్చే పసిపాపపై నగరంలో వాన పూలజల్లుగా పడుతుంది. భోరున కురవదు. ఆగస్టు 15న జెండా వందనం సమయంలో బాలబాలికలు బారులు తీరి నిలబడతారు. వారిపైనా వాన జాలిగా సన్నని తుంపరగానే పడుతుంది. జలజలా కురవదు.

**VIII. కిందివాటిలో రెండింటికి సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.**

**1.** **చార్మినార్ నిర్మాణం, ప్రాముఖ్యం తెలపండి.**

**జ:** గోలకొండ పట్టణంలో 1589 ప్రాంతంలో మహమ్మారి పీడ సంభవించింది. లెక్కలేనంతమంది మరణించారు. చివరకు కొందరు సాధువులు పీర్ల పంజాలు, తాబూతులు పట్టుకుని భజనలతో ఊరేగారు. దానితో ఆ మహమ్మారి పీడ వదిలిపోయింది. దానికి జ్ఞాపక చిహ్నంగా మహ్మద్ కులీ కుతుబ్‌షా 1591లో హైదరాబాద్‌లో 'తాబూతు' ఆకారంలో 'చార్మినార్‌ను నిర్మించాడు.

**2.** **గోదావరి నది గురించి బాపిరాజు చేసిన వర్ణన ఎలాంటిది?**

**జ:** అడవి బాపిరాజు గోదావరి నదిని వర్ణిస్తూ రాసిన పాటలో గొప్ప భావముంది. 'గోదావరి నది పొంగిపోయింది. పైకి ఎగిసి పడింది. కొండల్లో, కోనల్లో దుమికింది. ఆకాశాన్ని అంటుకునేలా తన చేతులు చాచింది. శంకరాభరణ రాగాన్ని తన కంఠంతో ఆలపిస్తోంది'. ఈ విధంగా తన కవితా పటిమతో భావాన్ని మనకు సజీవ చలన చిత్రాన్ని కళ్లెదుట నిలబెట్టేలా గోదావరి నది గురించి బాపిరాజు వర్ణించారు.

**IX. కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.**

**1.** **'పాండురంగ మహత్యం'ను అంకితం పొందిందెవరు?**

**జ:** పాండురంగ మహత్మ్యాన్ని విరూరి వేదాద్రి మంత్రి అంకితం పొందారు.

**2.** **ఇంద్రుడి భార్య పేరేమిటి?**

**జ:** ఇంద్రుడి భార్య పేరు శచీదేవి (పులోమజ).

**3.** **ఫ్రీవర్స్ ఫ్రంట్‌ను ఎవరు స్థాపించారు.**

**జ:** ఫ్రీవర్స్ ఫ్రంట్‌ను కుందుర్తి ఆంజనేయులు స్థాపించారు.

**4.** **శ్రీనాథుడు రచించిన రెండు గ్రంథాల పేర్లను రాయండి.**

**జ:** అ) శృంగార నైషధం ఆ) హరవిలాసం

**5.** **పాలవెంకట సుబ్బయ్య కవిత్వ గురువు ఎవరు?**

**జ:** బ్రహ్మశ్రీ వేదం వెంకట కృష్ణశర్మ.

**6.** **బాలకార్మికుడి జీవితాన్ని కవి ఏమని పేర్కొన్నాడు?**

**జ:** బాలకార్మికుడి జీవితాన్ని వెలుగు లేని జీవితమని కవి పేర్కొన్నాడు.

**X. కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.**

**1. 'నగీనాబాగ్' అంటే ఏమిటి?**

జ: గోలకొండలోని అందమైన ఉద్యానవనాల్లో ఇది ఒకటి.

**2. బ్రహ్మదేవుడికి మొదట ఎన్ని తలలుండేవి?**

జ: బ్రహ్మదేవుడికి మొదట అయిదు తలలు ఉండేవి.

**3. ఆచారాలు – సంస్కరణలు వ్యాస రచయిత ఎవరు?**

జ: 'ఆచారాలు - సంస్కరణలు'ను డాక్టర్ రావిభారతి రచించారు.

**4. హిట్లర్ చర్యలను నిరసిస్తూ చార్లీచాప్లిన్ తీసిన సినిమా ఏది?**

జ: చార్లీచాప్లిన్ 'ద గ్రేట్ డిక్టేటర్' అనే సినిమా తీశాడు.

**5. గోపీచంద్ రాసిన ఏ నవలకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించింది?**

జ: గోపీచంద్ రాసిన 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'కు ఈ అవార్డు లభించింది.

**6. 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా' అని పిలిచిన కవి ఎవరు?**

జ: అడవి బాపిరాజు

**XI. కిందివాటిలో ఒక దానికి లక్షణాలు తెలిపి, ఉదాహరణలతో వివరించండి.**

**చంపకమాల:**

- ప్రతి పాదానికీ 21 అక్షరాలుంటాయి.
- వరుసగా న, జ, భ, జ, జ, జ, ర అనే గణాలుంటాయి.
- ప్రతి పాదానికీ 11వ అక్షరం యతి మైత్రి కలిగి ఉంటుంది.
- నాలుగు పాదాల్లో ప్రాస నియమం ఉంటుంది.
- అన్ని పాదాలకు లక్షణాలు సమానం.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | I I I | I ∪ I | ∪ I I | I ∪ I | I ∪ I | I ∪ I | ∪ I ∪ |
| **ఉదా:** | హ రి పె | క లిం చి | తె చ్చి వి | హ గా ధి | పు పై ని | డి యె న్మ | దం బు నన్ |
| | న | జ | భ | జ | జ | జ | ర |

**యతిమైత్రి:** 1, 11 అక్షరాలైన హ, గా

**తేటగీతి:**

- నాలుగు పాదాలుంటాయి.
- ప్రతి పాదానికీ వరుసగా ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలుంటాయి.
- ప్రతి పాదంలోనూ 1 - 4 గణాల మొదటి అక్షరానికి యతిమైత్రి ఉంటుంది.
- ప్రాస నియమం లేదు.
- ప్రాసయతి పాటించవచ్చు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | I I I | ∪ ∪ I | ∪ I I | ∪ I | ∪ I |
| **ఉదా:** | భ ర త | ఖం డం బు | చ క్క ని | పా డి | యా వు |
| | న | త | భ | హ | హ |

**యతిమైత్రి:** 1, 4 గణాల మొదటి అక్షరాలు భ, పా

**XII. కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.**

**1. ఉత్పలమాల గణాలేమిటి?**

జ: ఉత్పలమాల గణాలు - భ, ర, న, భ, భ, ర, వ

**2. శార్దూలం పద్యంలో ఎన్నో అక్షరానికి యతిమైత్రి ఉంటుంది?**

జ: శార్దూల పద్యంలో 13వ అక్షరానికి యతిమైత్రి ఉంటుంది.

**3. ఆటవెలదిలో యతిమైత్రి ఏయే గణాల మొదటి అక్షరాలకు ఉంటుంది?**

జ: యతిమైత్రి 1, 4 గణాల మొదటి అక్షరాలకు ఉంటుంది.

**4. సీసపద్యానికి అనుబంధంగా ఏయే పద్యాలు రాయాలి?**

జ: సీస పద్యానికి అనుబంధంగా ఆటవెలది లేదా తేటగీతి పద్యాలు రాయాలి.

**5. ప్రాసయతి అంటే ఏమిటి?**

జ: పాదంలోని ప్రాస అక్షరానికి, యతిస్థానం తర్వాత అక్షరానికి జరిగే మైత్రి.

**6. కంద పద్యంలో బేసి స్థానంలో ఏ గణం ఉండకూడదు?**

జ: కంద పద్యంలో బేసి స్థానంలో (1, 3, 5, 7) 'జ' గణం ఉండకూడదు.

**XIII. కిందివాటిలో ఒకదానికి లక్షణాలు తెలిపి ఉదాహరణలతో వివరించండి.**

**1.** **రూపకాలంకారం:** ఉపమేయానికి, ఉపమానానికి అభేదం (భేదం లేకపోవడం) గానీ, తాద్రూప్యంగానీ చెప్పినట్లయితే అది రూపకం.

**(లేదా)**

ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించినట్లయితే అది రూపకం.

**ఉదా:** సంసార సాగరాన్ని ఈదడం చాలా కష్టం.

ఉపమేయం - సంసారం

ఉపమానం - సాగరం

సంసారం, సాగరం- ఈ రెండింటికీ అభేదం చెప్పడం.

**ఉదా:** ఆమె ముఖ చంద్రుడిలో ఆనందం కలుగుతుండగా.. ఇక ఆ చంద్రుడితో పనేమిటి?

**2.** **అతిశయోక్తి:** గోరంతను కొండంతగా వర్ణిస్తే అది అతిశయోక్తి. ఉన్న వస్తువును అతిశయించి చెప్పడమే అతిశయోక్తి అలంకారం.

**ఉదా:** తాటియంత విల్లు ధరియించినాడవు.

❋ పైపాదంలో విల్లును తాటిచెట్టంత ఉందని వర్ణించడం అతిశయోక్తి.

**ఉదా:** మా పొలంలో బంగారం పండింది.

**XIV. కింది ప్రశ్నలన్నింటికీ ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.**

**1. ఉపమేయం అంటే ఏమిటి?**

**జ:** వర్ణించే వస్తువును ఉపమేయం అంటారు.

**2. 'కమలాక్షునర్చించు కరములు కరములు' ఈ పాదంలో ఏ అలంకారముంది?**

**జ:** ఈ పాదంలో లాటానుప్రాస అలంకారం ఉంది.

**3. 'వలె, పోలె, అట్లు' ఈ పదాలను ఏమని పిలుస్తారు?**

**జ:** వీటిని ఉపమావాచకాలు అంటారు.

**4. అంత్యప్రాసకు ఒక ఉదాహరణ రాయండి.**

**జ:** **ఉదా:** గుర్రపు కళ్లెం/ తలుపు గొళ్లెం

**5. ఉపమేయ, ఉపమానాలకు అభేదం చెప్పే అలంకారమేది?**

**జ:** రూపకాలంకారం

**6. అర్థాలంకారం అంటే ఏమిటి?**

**జ:** అర్థం ప్రధానమైన అలంకారాలను అర్థాలంకారాలు అంటారు.

**XV. కింది పదాలను ఆధారంగా చేసుకుని, విద్యార్థి ఆదాయపత్రం కోసం అధికారితో జరిపిన సంభాషణను రాయండి.**

ఆదాయపత్రం - దరఖాస్తు - జతపరచు - ఉపకారవేతనం

జ: **విద్యార్థి:** నమస్కారమండీ! నా పేరు చైతన్య.

**అధికారి:** నమస్తే! చెప్పండి. ఏ పనిమీద వచ్చారు?

**విద్యార్థి:** మీరు జారీ చేసే ఆదాయపత్రం కోసం దరఖాస్తు చేసుకుందామని వచ్చాను! ఒకసారి చూడండి సార్!

**అధికారి:** దరఖాస్తు ఇవ్వండి. మీ వివరాలన్నీ ఉన్నాయా?

**విద్యార్థి:** ఉన్నాయి సార్! సంబంధిత పత్రాలన్నీ జతపరిచాను.

**అధికారి:** ఉపకారవేతనాన్ని ఏవిధంగా ఉపయోగిస్తావు చైతన్య?

**విద్యార్థి:** తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా పుస్తకాలు, దుస్తులు.. ఇతర వస్తువులు కొనుక్కుంటాను. ఆదాయ పత్రాన్ని ఎప్పుడు ఇస్తారు సార్!

**అధికారి:** రెండు రోజుల్లో ఇస్తాను.

**విద్యార్థి:** ధన్యవాదాలు సార్!

**XVI. అ. కింది ప్రశ్నలకు ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.**

**1. సర్వనామం అంటే ఏమిటి?**

జ: నామవాచకానికి బదులుగా వాడేది. (**ఉదా:** ఆమె, అతడు)

**2. విశేషణానికి ఓ ఉదాహరణ రాయండి?**

జ: నామవాచక, సర్వనామాల గుణాలను తెలియజేసేది (**ఉదా:** రాణి మంచి పిల్ల).

**3. 'అశోకుడు గొప్ప చక్రవర్తి' ఇందులో నామవాచకమేది?**

జ: ఇందులో నామవాచకం అశోకుడు.

**4. 'కృష్ణ మైదానానికి వెళ్లాడు' ఇందులో క్రియాపదం ఏది?**

జ: 'వెళ్లాడు' అనేది క్రియా పదం. చేసే పనిని తెలియజేసేది క్రియ.

**5. 'అప్పుడు, ఇప్పుడు' అనేవి ఏ భాషా భాగానికి చెందుతాయి?**

జ: ఈ పదాలు 'అవ్యయం' అనే భాషా భాగానికి చెందుతాయి.

**6. నామవాచకం అంటే ఏమిటి?**

జ: నామం అంటే పేరు. పేరును తెలియజేసేది నామవాచకం. **ఉదా:** రాజు, గిరి

**ఆ) కింది ప్రశ్నలకు ఒక వాక్యంలో సమాధానాలు రాయండి.**

**1. వాక్యదోషాలు ఎన్ని రకాలు?**

జ: వాక్యదోషాలు మూడు రకాలు (భావ, భాష, ఉచ్చారణ)

**2. 'కృష్ణదేవరాయలు ఆధునిక కవి' అనే వాక్యంలో దోషాన్ని ఏమని పిలుస్తారు?**

జ: దీన్ని భావ దోషం అని అంటారు.

**3. 'సీత అడవికి వెళ్లాడు' అనే వాక్యంలో దోషాన్ని సవరించి తిరిగి రాయండి.**

జ: ఈ వాక్యంలో భాషా దోషం ఉంది. 'సీత అడవికి వెళ్లింది' సరైన వాక్యం.

**4. వర్ణ వ్యత్యాయానికి ఒక ఉదాహరణ ఇవ్వండి.**

జ: 'పగిలిన - పలిగిన' అనేది వర్ణవ్యత్యాయానికి ఉదాహరణ.

**5. 'విద్యార్థి – విధ్యార్ధి'లో అక్షరదోషం ఉన్న పదం?**

జ: విధ్యార్ధి

**6. 'పరిణతి – పరినతి' ఏ విధమైన దోషం?**

జ: అనునాసిక దోషం

*ఈ నమూనా ప్రశ్నపత్రాన్ని రూపొందించింది:* ***భమిడిపాటి గౌరీశంకర్***